క్లుప్తంగా

విద్యార్థులకు క్రీడాపోటీలు



లాంగ్ జంప్ చేస్తున్న విద్యార్థిని

చిత్తూరు కలెక్టరేట్ : జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం నగరంలోని మెసానికల్ మైదానంలో క్రీడాపోటీలు నిర్వహించారు. నగరంలోని పలు పాఠశాలల 8,9వ తరగతుల చదివే విద్యార్థులు ఈ పోటీలకు ఉత్సాహంగా హాజరయ్యారు. విద్యార్థులకు లాంగ్ జంప్, షాట్‌పుట్, పరుగుపందెం పోటీలను నిర్వహించినట్లు డీఎస్‌డీఓ బాలాజి తెలిపారు. వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువుతో పాటు సంస్కారం ముఖ్యం



మాట్లాడుతున్న శతావధాని ఆముదాల మురళి

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం ముఖ్యమని శతావధాని ఆముదాల మురళి అన్నారు. మంగళవారం కొంగారెడ్డిపల్లెలోని గాండ్లపల్లె మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అమృత భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నతనం నుంచి ఒక లక్ష్యం నిర్దేశించుకుని దానిని సాధించాలనే పట్టుదలతో ముందుకెళ్లాలన్నారు. అమృత భారతి వ్యవస్థాపకులు ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశ సంస్కృతిని పరిరక్షించడంలో విద్యార్థులదే కీలకపాత్ర అని అన్నారు. స్వామి వివేకానంద జీవితాన్ని, బోధనలను విద్యార్థులు తెలుసుకుని ఆచరించాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గీతాంజలి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ సద్వినియోగం చేసుకోండి



పోలీసు అధికారులతో సమావేశమైన సివిల్ జడ్జి లిఖిత

– జూనియర్ సివిల్ జడ్జి లిఖిత

పలమనేరు: పట్టణ సమీపంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సెప్టెంబర్ 14న జరిగే జాతీయలోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి ఎం.లిఖిత తెలిపారు. స్థానిక కోర్టులో సీఐలు, ఎస్ఐలు, ఇతర సంబంధింత శాఖల అధికారులు, న్యాయవాదులతో ఇందుకు సంబంధించిన సమావేశాన్ని ఆమె మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గం కాబట్టి కక్షిదారులు అనవసరమైన పంతాలకు పోకుండా కేసులను రాజీ చేసుకుని శాంతిపూర్వకంగా జీవించాలన్నారు. ఇందులో ప్రిలిటికేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చునని సూచించారు. చెక్‌బౌన్స్, జీవనాధారం, వేధింపులు, గృహహింస, సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకునేందుకు ఇది మంచి అవకాశమన్నారు. కక్షిదారులు దీనిని సద్వినియోగం చేసుకునే దిశగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా పోలీసులు పెండింగ్ కేసుల రాజీకి కృషిచేయాలని సూచించారు. సీఐ మురళీమోహన్, ఎస్ఐ స్వర్ణతేజ, బార్ అధ్యక్షులు లక్ష్మీపతి, పరమశివప్ప పాల్గొన్నారు.

కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో ఈఎస్ఎఫ్ పోటీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కుప్పంరూరల్: కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో ఈఎస్ఎఫ్ (ఇంటర్మేషనల్ స్టార్టప్ ఫౌండేషన్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఐడియాథాన్, రూరల్ స్టార్టప్ పోటీలను నిర్వహిస్తోంది. ఈ పోటీల్లో భాగంగా చిత్తూరు రీజియన్‌కు సంబంధించిన పోటీలు నిర్వహించేందుకు కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ఎంపికైనట్లు వైస్ చైర్మన్ డా. సునీల్‌రాజ్ చెప్పారు. ఈ పోటీలను సెప్టెంబర్ 13 నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలు సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 4 వరకు నిర్వహించే అంకురా బస్సు యాత్రల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందన్నారు. నూతన ఆవిష్కరణలు, ఆలోచనలు ఉన్న వారు కళాశాలలో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు. ప్రిన్సిపల్ డా.సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ భాస్కరన్, పీఆర్వో ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

డాక్టర్లకు ప్రత్యేక చట్టాలు ఉండాలి



కోల్‌కతా సంఘటన చాలా బాధాకరం. ఆమెకు నా నివాళి. ఇటువంటి సంఘటన మరోసారి దేశంలో జరగకుండా మహిళా డాక్టర్లకు ప్రత్యేకమైన చట్టం తీసుకొస్తే బాగుంటుంది. అది ఆడవారిని చెడు దృష్టితో చూసేందుకే భయపడేలా ఉండాలి. వారికి రక్షణ కల్పించకపోతే రోగులకు ఏవిధంగా వైద్యసేవలు అందిస్తారు ? ప్రభుత్వాలు ఆలోచించాలి. ఈ సంఘటనలో నేరస్తులను వెంటనే గుర్తించి అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి.

- శాంతికళ, సిస్టర్ ట్యూటర్, చిత్తూరు



నిరంతర రక్షణ అవసరం

హాస్పిటల్స్ వద్ద నిరంతరం రక్షణ చర్యలు చేపట్టాలి. ప్రధానంగా రాత్రుల సమయంలో పోలీసు బీట్లు కచ్చితంగా ఉండాలి. అన్ని ప్రాంతాలు కవర్ అయ్యేలా సీసీ టీవీ కెమెరాలను అమర్చాలి. పేషెంటుకు సంబంధం లేని వ్యక్తులు హాస్పిటళ్లలోకి ప్రవేశించకుండా చూడాలి. నైట్ డ్యూటీలకు వచ్చే మహిళా వైద్యులు, వైద్య సిబ్బంది పని చేసే ప్రదేశంలో, ప్రయాణంలో ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలి.

- సాయి హర్షిత, జూనియర్ డాక్టర్, చిత్తూరు



కరెంట్..లైన్ క్లియర్

నగర విద్యుత్ సమాచారం

గృహావసరాలు	:	59,876
వాణిజ్యం	:	12,224
పరిశ్రమలు	:	550
ప్రభుత్వ సర్వీసులు		
వీధిదీపాలు	:	1563
వ్యవసాయ సర్వీసులు	:	415
మొత్తం సర్వీసులు	:	74,268



నగరంలో మొత్తం సబ్‌స్టేషన్లు : 7

ప్రాంతాల వారీగా వివరాలు :
మిట్టూరు, కట్టమంచి, గిరింపేట, సంతపేట, ఎస్టేట్, ఎంఎస్ఆర్, గాంధీరోడ్డు నూతన లైన్ ఏర్పాటు ప్రాంతం

కట్టమంచి-దొడ్డిపల్లె 33 కేవీ లైన్ పొడవు	:	4.7 కిలోమీటర్లు
వాటి వ్యయం అంచనా	:	రూ.1.30 కోట్లు
ఏర్పాటు చేయనున్న టవర్లు	:	7
12 మీటర్ల కరెంటు స్తంభాలు	:	80
9 మీటర్ల కరెంటు స్తంభాలు	:	20
ట్రాన్స్‌ఫార్మర్లు	:	20

- కట్టమంచి సబ్‌స్టేషన్‌కు ప్రత్యామ్నాయ లైన్
- 4.7 కి.మీ.. రూ.1.30 కోట్లతో నిర్మాణం
- ప్రారంభమైన సర్వే పనులు

చిత్తూరు కార్పొరేషన్: కాసేపు కరెంటు పోతే తిరిగి ఇళ్లలో, కార్యాలయాల్లో ఉస్సురంటూ నిట్టూరుస్తూ కరెంటు ఎప్పుడొస్తుందా? అని వాకిల వంక చూసే పరిస్థితి. కరెంటు కూడా నిత్యావసర సరుకు అయ్యింది. కరెంటు లేకపోతే ఇళ్లల్లో ముప్పావువంతు పనులు ఆగినట్లే. నగరంలో కరెంటు సరఫరాలో ఇబ్బందులపై ట్రాన్స్‌కో అధికారులు దృష్టి సారించారు. ఒకచోట విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే ప్రత్యామ్నాయ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా తీసుకుంటున్నారు. కానీ కట్టమంచి సబ్‌స్టేషన్‌కు మాత్రం ప్రత్యామ్నాయం లేకపోవడంతో ఆ పరిధిలోని వినియోగదారులు అడపాదడపా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గత సంవత్సరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రత్యామ్నాయ లైను ఏర్పాటు కోసం అనుమతులిచ్చారు. తదనంతరం ఎన్నికల షెడ్యూల్, ఇతర కారణాలతో పనులు కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం ఆ పనులను లైనెక్కించారు. సర్వే పనులను ప్రారంభించారు. మొత్తం 4.7 కిలోమీటర్ల లైన్‌ను రూ.1.30 కోట్లతో వేయనున్నారు.

74వేల సర్వీసులు ఉన్న నగరంలో నెలకు విద్యుత్ బిల్లుల రూపంలో రూ.8 కోట్ల ఆదాయం వస్తోంది. దాదాపు ప్రతి సబ్‌స్టేషన్‌కు 10 వేల సర్వీసులు ఉన్నాయి. నగరంలో మొత్తం 7 సబ్‌స్టేషన్లు ఉండగా అందులో ఆరింటికి మరో సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యామ్నాయ లైన్ ఉంది. ఒక సబ్‌స్టేషన్ పరిధిలో కరెంటు పోతే ఈ లైన్ ద్వారా మరో సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ తీసుకుంటారు. అదే కట్టమంచి సబ్‌స్టేషన్‌లో విద్యుత్ అంతరాయం కలిగితే అది పరిష్కారమయ్యే వరకు ప్రత్యామ్నాయంగా విద్యుత్ తీసుకోలేని పరిస్థితి ఉండేది. ఇప్పుడు ప్రత్యామ్నాయం కల్పించే దిశగా చర్యలకు ఉపక్రమించారు.

నూతన లైన్ ఏర్పాటుకు గతంలో సర్వే చేశారు. కట్టమంచి సమీపంలోని గాంధీరోడ్డు సబ్‌స్టేషన్ నుంచి లైన్ తీయాలని భావిస్తే రైల్వే లైన్‌తో పాటు కోర్టు భవనం అడ్డంగా ఉంటోంది. వీటికి అనుమతులు పొంది పనులు చేయాలంటే ఆలస్యమవుతుంది. ఇక కట్టమంచి సబ్‌స్టేషన్ వెనుక ఉన్న అంబేడ్కర్ భవన్ వద్ద ఉన్న సబ్‌స్టేషన్ నుంచి తీసుకోవాలంటే రైల్వే స్టాపింగ్ అవరోధంగా ఉంది. డీఈఓ కార్యాలయం సమీపంలోని సబ్‌స్టేషన్ నుంచి తీసుకుందామంటే హైరోడ్డులోని వాణిజ్య భవనాలు ఉన్నాయి. 33 కేవీ లైన్ ఏర్పాటు, స్తంభాలు దుకాణాలు ముందర పెట్టడానికి వ్యాపారులు సుముఖత చూపడం లేదు. దీంతో దొడ్డిపల్లె సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యామ్నాయ లైన్ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు.

నూతన లైన్‌ను 4.7 కిలోమీటర్లను రూ.1.30 కోట్ల అంచనాతో పూర్తి చేయాలని నిర్ణయించారు. మొత్తం 7 టవర్లు, 20 ట్రాన్స్‌ఫార్మర్లు, 100 కరెంటు స్తంభాలు ఏర్పాటు చేయనున్నారు. దీని కోసం ప్రాథమికంగా సర్వేకు శ్రీకారం చుట్టారు. కొన్ని నెలల్లో పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ,ఈఈ, డీఈలు (ఫైల్)

సబ్‌స్టేషన్ల వారీగా ప్రత్యామ్నాయ లైన్ల వివరాలు

ఎస్టేట్	:	బీఎస్ఆర్‌పేట
గిరింపేట	:	సంతపేట
సంతపేట	:	వెంగనపల్లె
గాంధీరోడ్డు	:	సంతపేట
మిట్టూరు	:	కొంగారెడ్డిపల్లె
ఎంఎస్ఆర్	:	సంతపేట

కరెంటు కష్టాలకు చెక్

“ నగరంలో కట్టమంచి సబ్‌స్టేషన్‌కు మాత్రమే ప్రత్యామ్నాయ సరఫరా లేదు. ఈ పనులు జరిగితే నగర పరిధిలో ఎక్కడ కరెంటు పోయినా మరో సబ్‌స్టేషన్ నుంచి సరఫరాను తీసుకోవచ్చు. కరెంటుకు ఇబ్బందులు పడాల్సిన పనిలేదు. నిర్మాణ విభాగం వరకు పనులను అప్పగించాం. వారు మరో మూడు నెలల్లో పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

- మునిచంద్ర, ఈఈ ట్రాన్స్‌కో



పిల్లలను పనుల్లో పెట్టుకుంటే కేసులు



దుకాణదారునితో మాట్లాడుతున్న అధికారులు

- జిల్లా సహాయ బాలల రక్షణాధికారి జగదీశ్వర్

బంగారుపాళెం: దుకాణాల నిర్వాహకులు చదువుకునే పిల్లలను పనుల్లోకి పెట్టుకుంటే కేసుల నమోదు, జరిమానా తప్పవని జిల్లా సహాయ బాలల రక్షణాధికారి జగదీశ్వర్ హెచ్చరించారు. మంగళవారం బంగారుపాళెం, తగ్గువారిపల్లె గ్రామాల్లో జిల్లా కార్మికశాఖ ఆధ్వర్యంలో వివిధ దుకాణాలను విస్తృతంగా తనిఖీలు చేశారు. బాలల చేత పనులు చేయిస్తున్నారా? అని ప్రధానంగా పరిశీలించారు. అనంతరం దుకాణ యజమానులతో ఆయన మాట్లాడారు. 14 ఏళ్ల లోపు ఉన్న పిల్లలను పనులకు పెట్టుకోవడం బాల కార్మిక చట్టం1986 ప్రకారం నేరమన్నారు. తల్లిదండ్రులు పిల్లలను చదువుకునేందుకు బడులకు పంపాలన్నారు. చదువుకునే వయస్సులో వారిని ఇతర పనులకు పంపి వారిని మానసిక, శారీరక ఇబ్బందులకు గురిచేయడం ఎంతమాత్రమూ సరికాదన్నారు. వారి భవితకు బాటలు వేయాలని, బాలకార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వళ్లెమ్మ, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలల పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గోకులాష్టమి



గోమాతకు పశుగ్రాసం పెడుతున్న ఈఓ, అధికారులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన గోశాలలో మంగళవారం గోకులాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి ప్రధాన ఆలయం నుంచి ఆలయ ఈఓ కె.వాణి, ఆలయ అధికారులు, ఉభయదారులు పూజాసామగ్రిని మేళతాళాలతో ఊరేగింపుగా గోశాలకు తీసుకెళ్లారు. గోశాల వద్ద ఏర్పాటు చేసిన కామధేనువు చిత్రపటానికి, గోవులకు వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోవులకు పశుగ్రాసం పెట్టారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు విద్యాసాగర్ రెడ్డి, ధనుంజయ, పర్యవేక్షకులు శ్రీధర్‌బాబు, మల్లికార్జున, ఉభయదారులు పాల్గొన్నారు.

ఉట్లోత్సాహం

గోకులాష్టమి పురస్కరించుకుని గోశాల వద్ద ఉట్లోత్సవం కోలాహలంగా నిర్వహించారు. పలువురు యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత ఈఓ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే చిన్నపిల్లలు రాధాకృష్ణుల వేషధారణలో భక్తులను ఆకట్టుకున్నారు.

మరుగుదొడ్ల ఫొటోల బాధ్యతను తప్పించాలి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

– డీఈఓకు యూటీఎఫ్ నాయకుల వినతి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యతను టీచర్లకు తప్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ డిమాండ్ చేశారు. ఇదే విషయమై అసోసియేషన్ నాయకులతో కలిసి మంగళవారం ఆయన డీఈఓ ఆ దేవరాజుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించరాదని, బోధనకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు. ముఖ్యంగా మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యత నుంచి తొలగించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా ఆ బాధ్యతలను తప్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని, అయితే మళ్లీ టీచర్లతోనే ఫొటోలు తీయిస్తున్నారని నిరసించారు. ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు, గ్రామ సచివాలయ సిబ్బంది చేత ఫొటోలు తీయించే పనులు చేయించాలని ఉత్తర్వుల్లో ఆదేశించారని, రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి అరగంట వ్యవధిలో పది అంశాలతో కూడిన గూగుల్ ఫామ్ పూర్తి చేసి ప్రధానోపాధ్యాయులు అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఎస్ఎంసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది ఫొటోలు తీయకపోతే ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలని ఉన్నతాధికారులు హుకుం జారీచేస్తున్నారని ఆరోపించారు. మరుగుదొడ్ల ఫొటోల బాధ్యత తగ్గిందని భావిస్తున్న తరుణంలో మరింత భారాన్ని మోపుతూ ఉత్తర్వులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఇచ్చిన బాధ్యతలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మణిగండన్, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, రెడ్డెప్ప నాయుడు, ఎస్పీ బాషా, పార్థసారథి, గణేష్ కుమార్, సాధన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోనేటిరాయుని ఆలయంలో గోకులాష్టమి

గంగవరం: శ్రీకృష్ణ గోకులాష్టమి వేడుకలు కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయంలో మంగళవారం వైభవంగా జరిగాయి. కోనేటిరాయస్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సమీంలోని స్వామివారి ఉద్యానవనంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని నూతనంగా ప్రతిష్ఠించారు. అనంతరం గోవులను పూజించారు. సాయంత్రం స్వామివారు శ్రీకృష్ణావతారంలో రుక్మిణి, సత్యభామ సమేతంగా తిరుచ్చిపైకి వేంచేసి పురవీధుల్లో విహరించారు.

ఆర్ఎంపీ క్లినిక్‌ల తనిఖీ

బైరెడ్డిపల్లె: మండల పరిధిలో నిర్వహిస్తున్న ఆర్ఎంపీ క్లినిక్‌లను బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారులు విజయ్‌చంద్ర, అరుణ్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. పలమనేరులో రెండు రోజుల క్రితం ఆర్ఎంపీ డాక్టర్ నిర్లక్ష్యం కారణంగా వైద్యం వికటించి ఇంటర్ విద్యార్థిని మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో మండలంలో ఆర్ఎంపీలు క్లినిక్‌లు నిర్వహిస్తుండడంతో తనిఖీలు నిర్వహించి సలహాలు-సూచనలు ఇచ్చారు. ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని స్పష్టం చేశారు. సీహెచ్ఓ అనూరాధ, సిబ్బంది సావిత్రి, శ్రీదేవి, గోపి, హరి, నవీన, కవిత, సుజాత, భారతి పాల్గొన్నారు.



ఆర్ఎంపీ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న వైద్యాధికారులు

వాణిజ్య పన్నుల ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో జరిగిన అక్రమాలపై విచారణ చేసిన తర్వాతే బదిలీల ప్రక్రియకు పూనుకోవాలని ఏపీసీటీఎస్ఏ డివిజన్ అధ్యక్షుడు పూర్ణం డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మంగళవారం స్థానిక వాణిజ్య పన్నులశాఖ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, గతంలో జరిగిన అక్రమాలు, రాష్ట్ర ఉన్నతాధికారుల అవినీతిపై దర్యాప్తు చేయాలన్నారు. ప్రాంతీయ కార్యాలయాలను రద్దు చేయాలన్నారు. అధికారాల కేంద్రీకరణను మార్పు చేయాలన్నారు. జీఎస్టీఓలకు చట్టబద్ధమైన అధికారాలు కల్పించాలని, సెంట్రల్ రిజిస్ట్రేషన్ యూనిట్ రద్దు చేయాలని, ఉద్యోగుల బదిలీల పై శాశ్వత విధానాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. సర్కిల్స్ వ్యవస్థను బలహీనపరిచే చర్యలను వ్యతిరేకిస్తున్నామన్నారు. డిమాండ్లు నెరవేరే వరకు రోజూ నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రమణ్యం, కృష్ణమూర్తి, యోగేంద్రనాయుడు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో 104 వైద్యసేవలు

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటివద్దకే వైద్యసేవలు అందిస్తున్నామని గుడిపాల,బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారులు సంధ్య, రష్మిత తెలిపారు. మంగళవారం వెప్పాలమానుచేను, కుప్పిగానిపల్లెలో 104 వైద్య శిబిరం నిర్వహించారు. 120 మంది రోగులకు బీపీ, షుగర్, గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ వైద్యపరీక్షలను నిర్వహించారు. మంచం పట్టిన రోగుల ఇళ్లకే వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో తెలుసుకుని సలహాలు-సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది చంద్రశేఖర్, రుక్మిణి, కవిత, శిల్ప, దివ్య, శివగామి, కిరణ్‌కుమారి పాల్గొన్నారు.



గుడిపాల: వైద్యసేవలు అందజేస్తున్న డాక్టర్ సంధ్య

వేదగిరివారిపల్లెలో..

ఐరాల: గ్రామీణులకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వేదగిరివారిపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపరుచుకోవాలని సూచించారు. దోమకాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



గుడిపాల: రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రష్మిత



ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్